సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో మంగళవారం రైతు, కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుబజార్‌లోని రైతులతో సంఘం అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి జీవిత బీమా వర్తిస్తుంది? ప్రమాదానికి గురైన వారికి ఆర్థిక సహాయం అందుతుందా? లేదా? అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



ఆరిలోవలో నాటకం ద్వారా ప్రజలకు పరిసరాలపై అవగాహన కల్పిస్తున్న కళా బృందం

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్ దుర్గాలమ్మ గుడి వద్ద మంగళవారం పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్‌పీసీఎల్, జీవీఎంసీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళా బృందం సభ్యులు వీధి నాటకం ప్రదర్శించారు. పరిసరాలను ఏవిధంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలి, ప్లాస్టిక్ వాడకం వల్ల ఎలాంటి అనర్థాలు కలుగుతాయో వివరించారు. ప్లాస్టిక్ మహమ్మారి వాతావరణాన్ని ఏవిధంగా కలుషితం చేస్తుందో నాటకం ద్వారా తెలియజేశారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- చంద్రంపాలెం హైస్కూల్ సందర్శించిన డీఈవో చంద్రకళ

మధురవాడ : పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ చెప్పారు. మంగళవారం సాయంత్రం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో మౌలిక వలసతులు, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీసారు. ఇక్కడ తాగు నీటి సమస్య, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సక్రమంగా లేకపోవడం, పాఠశాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు ఇబ్బందికరంగా పెరగడం, విద్యార్థులు భయపడేలా వున్న పరిస్థితులు గమనించారు. దీంతో తక్షణమే ఇంజినీరింగ్ శాఖ అధికారులను పిలిపించి బోరు నిర్మించి, తాగునీటి సమస్య పరిష్కరించాలని, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సరఫరా చేయాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. పాఠశాల పరిసరాల్లోని పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు, ఇంజినీరింగ్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అద్భుత కళా ఖండాలు





శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు వేసిన పెయింటింగ్స్



విద్యార్థులు వేసిన పెయింటింగ్స్‌తో శ్రీకృష్ణాపురం గురుకులంలో ప్రత్యేక హాల్

- చిత్ర లేఖనంలో గురుకులం విద్యార్థుల ప్రతిభ
- శ్రీకృష్ణాపురం గురుకులంలో ఆకట్టుకుంటున్న పెయింటింగ్స్ హాల్



పేపర్‌తో తయారు చేసిన వివిధ రకాల బొమ్మలు

ఆరిలోవ: చిత్ర లేఖనం కొందరికి హాబీ. మరికొందరికి ప్యాషన్. ప్రస్తుత కాలంలో పిల్లలు చదువుతో పాటు ఇతర రంగాలపైనా దృష్టిపెడుతున్నారు. ఆటలు, నృత్యాలతో పాటు కళలపైనా మక్కువ పెంచుకుంటున్నారు. అటువంటి వాటిలో చిత్రలేఖనం ప్రధానంగా నిలుస్తుంది. మదిలో మెదిలే ఆలోచనలు, ఊహకందని ఆలోచనలకూ దృశ్య రూపం ఇవ్వడమే చిత్ర లేఖనం. అటువంటి చిత్ర లేఖనంలో విశాఖ కేంద్ర కారాగారం సమీప శ్రీకృష్ణాపురంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. ఇక్కడి విద్యార్థులు విద్యతో పాటు చిత్ర లేఖనంలో అద్భుత ప్రతిభ ప్రదర్శిస్తున్నారు. వారు వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. వివిధ కట్టడాలు, పలు రకాల పండ్లు, పూలు, పక్షులు, చెట్లు, జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, పల్లె వాతావరణం తదితర వాటిని వాటర్ పెయింటింగ్స్ చేశారు. వాటితో పాటు కాగితాలతో వివిధ ఆకారాల్లో బొమ్మలు తయారు చేశారు. వీటన్నింటిని ఇక్కడ గురుకులం ఉపాధ్యాయులు ప్రత్యేకంగా ఓ హాల్లో సందర్శనకు కోసం ఏర్పాటు చేశారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ నైపుణ్యం ప్రదర్శిస్తుండడంపై ఉపాధ్యాయులు అభినందిస్తున్నారు. శనివారం గురుకులాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సునీల్ రాజ్ కుమార్ ఈ చిత్రాలను పరిశీలించి అభినందించారు. ఈ చిత్రాలు వేసిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

దోమల వ్యాప్తిపై అవగాహన అవసరం



దోమల వ్యాప్తిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఏయూ క్యాంపస్: మలేరియా, డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జియాలజిస్ట్ సాంబమూర్తి సూచించారు. స్థానిక 20వ వార్డు కేడీపీఎం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వర్షపు నీరు, మంచినీటిలో దోమలు పెరుగుతాయని, వారానికి ఒకసారి నీటిని నిల్వ చేసే డ్రమ్ములు, ట్యాంక్‌లను శుభ్రపరుచుకోవాలని సూచించారు. ఇంటిలో ఉండే గోలాలు, కుండీలు, ట్యాంకులపై మూతలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకుని, మందులు వాడాలని చెప్పారు. ఈ సందర్భంగా దోమలు పెరిగే ప్రదేశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మలేరియా విభాగం సూపర్‌వైజర్లు బి.శ్రీనివాస్, బి.కుమార్, పాఠశాల హెచ్‌ఎం సుమతి భాయి, హెల్త్ అసిస్టెంట్ రాజేష్, గణేష్, వేణు, జీవీఎంసీ సిబ్బంది నాయుడు, రాంబాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత సేవలే ఉద్యోగులకు గుర్తింపు



ఉద్యోగ విమరణ చేసిన ఆర్టీసీ కండక్టర్‌ను సత్కరిస్తున్న సహోద్యోగులు

మద్దిలపాలెం : విధుల్లో భాగంగా నిబద్ధతతో చిత్తశుద్ధిగా చేసిన సేవలే ఉద్యోగులకు గుర్తింపుని స్తాయని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. మద్దిలపాలెం డిపో కండక్టర్, ఎన్‌ఎంయూఏ జిల్లా జాయింట్ సెక్రటరీ కె.వి.రమణ ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మద్దిలపాలెం డిపో వద్ద ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు కె.వి. రమణ దంపతులను సత్కరించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ రమణ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, జోనల్ చైర్మన్ సూర్యం, జోనల్ నాయకులు సిహెచ్.ఇ.రావు, రీజనల్ సెక్రటరీ బి.నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

స్పృహ తప్పి మెకానిక్ రాము మృతి

- మృతదేహం కేజీహెచ్ మార్చురీలో భద్రం
- బంధువులు ఆరిలోవ పోలీసులను సంప్రదించాలి



మృతుడు రాము(ఫైల్)

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో రాము అనే వృద్ధుడు మృతి చెందాడు. అతనికి నా అనేవారు లేకపోవడంతో పోలీసులు కేజీహెచ్ మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురంలో ఏసుబాబు అనే వ్యక్తి నిర్వహిస్తున్న మోటార్ మెకానిక్ షెడ్‌లో కరణం రాము(66) కొన్నాళ్లుగా మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆయన మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు ఎవరూలేరు. ఆయన పనిచేస్తున్న మెకానిక్ షెడ్ సమీపంలో మంగళవారం ఉదయం స్పృహ కోల్పోయి రోడ్డుపై పడిపోయాడు. దీంతో ఏసుబాబు అతనిని 108 వాహనంలో వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడికి చేరేసరికి రాము మృతి చెందాడు. మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డులో కంచరపాలెం అని ఉంది. కానీ అక్కడ అడ్రస్‌లో అతనికి సంబంధించిన బంధువులు ఎవ్వరూ లేరు. రాము బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఉక్కు కార్మికులకు తక్షణం జీతాలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ యాజమాన్యం కార్మికులపై సర్క్యులర్ రూపంలో చేస్తున్న దాడిని ఆపి, తక్షణం జీతాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్కు యాజమాన్యం అనాలోచితంగా, అవివేకంతో విడుదల చేసిన సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికే సకాలంలో జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈఎంఐ చెల్లించే పరిస్థితి లేకుండా అపరాధులుగా చిత్రీకరించాలనే ఉద్దేశంతో ఇలా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. యాజమాన్యం ఇటువంటి ఆలోచనలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షుడు వై.టి.దాస్ మాట్లాడుతూ అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్న సీఎండీని తక్షణం రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పి.శ్రీనివాసరాజు, కె.బాలశౌరి, టి.వి.కె.రాజు, సూర్యనారాయణ, ముత్యాల నాయుడు, బి.మహేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

‘స్టాప్ డయేరియా’పై అవగాహన కల్పించాలి



భీమ్‌నగర్ యూపీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: స్టాప్ డయేరియా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం భీమ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య సేవల గురించి ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, గర్భిణులకు అందుతున్న సేవలను తనిఖీ చేసి, గర్భిణులకు ఐరన్ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. ఎనీమియాపై ఏఎస్‌ఎం, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యూపీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఏఎస్ఎం, ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులకు తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే-డ్రైడే పాటించాలని తెలిపారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిరాత వారాహి మాతకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో కిరాత వారాహి మాత

అల్లిపురం: భక్తుల విశేష పూజలందుకుంటున్న అల్లిపురంలోని శ్రీ షిర్డీసాయి దర్బార్‌లో వెలసిన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాల్గవ రోజు మంగళవారం అమ్మవారు కిరాత వారాహిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని వేపకొమ్మలతో విశేషంగా అలంకరించి షోడసోపచార సేవల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేసి అమ్మవారిని వారాహి స్తోత్రంతో కీర్తించి తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో సామూహిక లలితా సహస్ర నామాలు ఆలపించారు. అనంతరం అమ్మవారికి విశేష హారతులిచ్చారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థినులకు అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల జేకేసీ, ఐక్యూఏసీ, రసాయన శాస్త్ర విభాగం, గ్లోరియస్ ఐఏఎస్ అకాడమీ సంయుక్తంగా మంగళవారం కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఎలా ఎదుర్కోవాలి? విద్య అనంతరం ఎలా స్థిరపడాలి? అనే అంశాలపై మార్గ నిర్దేశం చేశారు. గ్లోరియస్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలోని అభ్యర్థుల కోసం ఒక యాప్ రూపొందించినట్టు చెప్పారు. యాప్ ద్వారా సులభంగా సమాచార సేకరణ వీలవుతుందని, తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని అభ్యర్థులు సేకరించి వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి. సంతోషి అనూష, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డి. అరుణపద్మ, రసాయనశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె. కల్యాణ్‌రామ్, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు బీఆర్‌టీఎస్‌లో సన్నాహాలు



పెదగదిలి వద్ద జేసీబీ సహాయంతో విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: సింహాద్రి అప్పన్న గిరి ప్రదక్షిణకు జీవీఎంసీ అధికారులు బీఆర్‌టీఎస్ రోడ్డును సన్నద్ధం చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా హనుమంతవాక నుంచి అడవివరం వరకు జీవీఎంసీ విద్యుత్ విభాగం సిబ్బంది మంగళవారం విద్యుత్ దీపాలను పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు, వాటికి అమర్చిన బల్బులు వెలుగుతున్నాయో? లేదో? జేసీబీ సహాయంతో పైకి ఎక్కి పరిశీలించారు. వెలగని బల్బులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి అమర్చారు. జీవీఎంసీ జోన్-2 కమిషనర్ శైలజావల్లి టీపీవో వరప్రసాద్, సచివాలయాల సిబ్బందితో కలిసి బీఆర్‌టీఎస్‌లో పర్యటించారు. రోడ్డు పక్కన బడ్డీల నిర్వహణను పరిశీలించారు. పెదగదిలి, చినగదిలి కూడళ్లలో రోడ్డు మీద నిర్వహిస్తున్న బడ్డీలను లోపలికి జరిపించారు. బడ్డీల పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.

ముందస్తు చర్యలతోనే వ్యాధుల నివారణ



సిబ్బందితో చర్చిస్తున్న డీఎంవో డాక్టర్ తులసి

మహారాణిపేట : డెంగ్యూ, మలేరియా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) డాక్టర్ తులసి అన్నారు. మంగళవారం కేజీహెచ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇక్కడ వారం పొడవునా వివిధ బ్లాకుల్లో నిఘా నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కొక్క బృందంలో ఏడుగురు సభ్యులు ఉంటారని, మొత్తం మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కేజీహెచ్‌లో దోమల సంచారం ఎక్కువగా ఉండే 9 ప్రాంతాలను గుర్తించామని, నవంబర్ వరకు నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. డెంగ్యూ, మలేరియా నివారణకు కేజీహెచ్‌లో జీవీఎంసీ మలేరియా నివారణ విభాగం ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో సబ్ యూనిట్ అధికారులు శ్రీనివాసాచార్యులు, శేషుబాబు, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్‌దత్తా, హెల్త్ అసిస్టెంట్ చలం తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



శ్రీకృష్ణాపురం గురుకులంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఆరిలోవ సీఐ గోవిందరావు

ఆరిలోవ: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఆరిలోవ సీఐ జి.గోవిందరావు సూచించారు. విశాఖ కేంద్ర కారాగారం పక్కన శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకులంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మంళవారం డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలన్నారు. కొంత మంది విద్యార్థి దశ నుంచే గంజాయికి అలవాటుపడుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సరదాగా మొదట్లో గంజాయి, మద్యం తాగడంతో అది అలవాటుగా మారి భవిష్యత్తు నాశనమవుతోందన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని గమనించి మోసపోవద్దని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ



పాల్గొన్న ఆర్‌టీఏ సిబ్బంది, ప్రజలు

మహారాణిపేట: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. మంగళవారం మాధవధారలో ఆర్‌టీఏ కార్యాలయంలో సిబ్బంది, ప్రజలకు మోటారు వాహన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించిన వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీవో జె.రామ్‌కుమార్, ఆర్‌టీఏ సిబ్బంది, పోలీసులు అధికారులు పాల్గొన్నారు.అనంతరం ట్రాఫిక్ చట్టాలపై విద్యార్థులకు విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గొల్లలపాలెంలోని శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ పాల్గొని పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సీనియర్ జడ్జి శేషమ్మ కోరారు.

పోలీసుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

మహారాణిపేట: పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రధాన ధ్యేయమని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. మంగళవారం కేజీహెచ్‌లో నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి పరీక్షలు చేయాలని తాను కోరిన వెంటనే కేజీహెచ్ సూపరింటెండెంట్ స్పందించారని తెలిపారు. సిబ్బందిని పరీక్షించేందుకు స్పెషలిస్టు వైద్యులను కూడా పిలిచారని తెలిపారు. ఈ శిబిరాన్ని రెండు వారాల పాటు కొనసాగిస్తారని, ప్రతి పోలీసు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎల్లప్పుడు బిజీగా ఉండే పోలీసులకు కూడా వైద్య పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జనరల్ మెడిసిన్, ఎండోక్రైనాలజీ, నెఫ్రాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ విభాగాలతో చర్చించి వారిని కూడా శిబిరాలకు ఆహ్వానించామన్నారు. ఇదిలా ఉండగా గత నెల సుమారు 3500 మంది పోలీసు సిబ్బందికి వివిధ పరీక్షలు నిర్వహించారు. మంగళవారం నాటి మెడికల్ క్యాంపులో వారిలో 49 మంది పోలీసులకు వైద్య సేవలు అందించి మందులు ఇచ్చారు. వీరిలో ఒకరికి శస్త్ర చికిత్స చేయవలసినదిగా వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ కేవీవీ సుబ్రహ్మణ్యం, ఏఆర్‌ఎంవో డాక్టర్ డి.భాస్కరరావు, డాక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

‘కేంద్ర ఉక్కు శాఖ మంత్రి స్పందించాలి’

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించటం లేదని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తామని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి ప్రకటన చేయాలని సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 1200 రోజులుగా స్టీల్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు. ప్లాంట్‌ను దెబ్బ తీసే విధంగా కేంద్ర ప్రభుత్వం, స్టీల్ యాజమాన్యం చర్యలు ఉంటున్నాయన్నారు. స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన ముడి సరకు సమ కూర్చకుండా తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నా రు. దేశంలోని అన్ని స్టీల్ పరిశ్రమలకు సొంత గనులు ఉన్నాయని, సొంత గనులు లేని ఏకైక ప్లాంట్ విశాఖ స్టీల్‌ప్లాంట్ అని, ఈ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. మూసివేసిన బ్లాస్ట్ ఫర్నేస్-3ను వెంటనే ప్రారంభించి పూర్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నడపాలన్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ తెలుగు వారి ఆత్మగౌరవమని, ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.